

## కథ

సిహెచ్.డి. లక్ష్మణరావు

# పునరావృతం

ఉద్యోగ విరమణ అయ్యింది.

ఇంట్లో హాయిగా ఉందామన్న నా కల నిజం కాలేదు.

కొడుకులిద్దరికీ చదువులు చెప్పించి, ఉద్యోగస్తుల్ని చేసి వాళ్ళకి పెళ్ళిళ్ళు చేసి మా చేతిలో వున్న ఆస్తిని అప్పజెప్పి సేదదీరుదామనుకునేసరికి ఇంట్లో తగాదాలు మొదలు.

ఇంత చేసిన మాకు వాళ్ళిచ్చే బహుమతి, మమ్మల్ని వాటాలతో, కాటాలో తూయించినట్లు పెద్దవాడి దగ్గరో నెల, చిన్నవాడి దగ్గరో నెల పంచుకుంటున్నారు.

'అడ్డాల్లో వున్నప్పుడే పిల్లలు తప్ప, గడ్డాలొచ్చిన తర్వాత కాదన్నది' స్పష్టమైంది.

''ఏవండీ నన్ను క్షమించండి. వీళ్ళేదో ఉద్ధరిస్తారని మిమ్మల్ని కూడా తూలనాడాను'' పాదాలపైబడి ఏడుస్తున్న నా భార్య భుజం పట్టుకుని లేవనెత్తుతూ

''ఇప్పుడేమనుకుంటే ఏం లాభం? మూలపడిన మనల్ని మెడబట్టుకుని బయటకు గెంటకముందే, ఒంట్లో ఓపికున్నప్పుడే మనం ఆశ్రమం చూసుకుని వెళ్ళిపోవడం మంచిది. చేతులారా చేసుకున్నది ఊరకనే పోతుందా?''

''చచ్చినదాన్ని మరింత చంపవద్దు'' తనలో తనే కృంగిపోతోంది.

''మన బ్రతులకి భరోసా, పెన్షను వుంది. ఏ ఆధారం లేని జీవితాలయితే ఎంత దుర్భరం. తలచుకుంటేనే భయంగా వుంది'' బొంగురుపోయిన గొంతుతో, నా భార్య నోటివెంట వచ్చిన మాటలకి ఆశ్చర్యపోయాను.

నా భార్య నా మాటకి ఎదురుచెప్పకుండా ఒప్పుకోవడం నా అరవై ఏళ్ళలో ఇదే మొదటిసారి.

సగం చెడితేగానీ బుద్ధిరాదుగా!

మా నిర్ణయాన్ని పిల్లల ముందుంచాం.

''మీ యిష్టం'' అన్నారు తప్ప, ఉండమని అనలేదు.

మా మనసులు రాయిలా మారాయి.

ఆశ్రమాల కోసం వాకబు చేసుకున్నాం.

గోవిందపురంలోగల ఆదర్శ ఆశ్రమానికి చేరుకున్నాం. నా శ్రీమతి మనసు కల్లోలంతో నిండిపోయింది. ఆ బాధ ఆమె ముఖంలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఆశ్రమంలో అడుగుపెట్టాం.

ఆశ్రమం యాజమాన్యం మమ్మల్ని వివరాలు అడిగారు.

''నా పేరు రాజేందర్, నా భార్య పేరు కౌముది. దగాపడిన తల్లిదండ్రులం'' చెప్పగానే, సిబ్బంది మా వంక పరీక్షగా చూస్తూ...

''అన్నపూర్ణమ్మగారు మీకేమవుతారు?'' ప్రశ్నించాడు మేనేజరు.

''మా అమ్మగారే! మా అత్తగారే!'' ఏకకంఠంతో చెప్పామిద్దరమూ.

''ఈ ఆదర్శ ఆశ్రమం మీ అమ్మగారు స్థాపించిందే! అభాగ్యులెందరికో ఇక్కడ స్థానం కల్పించారు. ఆశ్రమానికి విరాళాలు ఎంతోమంది మహానుభావులు అందించారు. అన్నీ బాగున్నా, మిమ్మల్ని గూర్చే ఆమె దిగులు చెందేవారు. చివరి చూపులు దక్కక పోతాయా? అని ఎదురుచూశారు. ఆశ తీరకముందే, కాలం చేశారు'' మేనేజరు బాధపడుతూ మెల్లగా చెప్పాడు.

నేను, కౌముది నిశ్చేష్టులమయ్యాము.

ఏడుపు మా సొంతమయ్యింది. కౌముది భోరున విలపించింది. అప్పటికే తన కళ్ళు బాగా వాచిపోయాయి. అది చూడలేక మేనేజరు ''ఊరుకోండమ్మా..అంతా దైవఘటన'' సముదాయించడానికి ప్రయత్నించాడు.

''ఓదార్పుకి అర్హురాలు కాదామె! తన కన్నీటితో పాపాన్ని కడుక్కోనివ్వండి. కళ్ళలో కన్నీరంతా ఇంకిపోయేవరకు ఏడ్వనివ్వండి. తాపత్రయపడి బావుకున్నదేమిటో అర్థమయ్యే వరకు బాధపడనివ్వండి''

''మీరు మరీ కఠినంగా మాట్లాడుతున్నారు'' మేనేజరు నన్ను వారించబోయాడు.

మేనేజరుకి గతాన్ని వివరించాను.

★ ★ ★

హఠాత్తుగా నాన్నగారు పోయారు. ఆయనో ప్రైవేటు ఉద్యోగి. ఉండడానికి సొంతిల్లు తప్ప, వెనక చెప్పుకోతగ్గ ఆస్తులేమీ లేవు. భర్త పోయి అమ్మ పుట్టెడు దుఃఖంలో ఉంది. అప్పటికి నా వయస్సు పద్నాలుగేళ్ళు.

''ఏ జన్మ పాపమో- ఈ జన్మశాపమో వీడి భవిష్యత్తు ఎలాగో?'' నా మీద జాలిపడిన లోకుల మాటలు, నా చెవినపడ్డాయి.

అమ్మకి అందరూ ఉన్నా, పరిస్థితులు తలక్రిందులయ్యేసరికి ఏకాకిగా మిగిలింది.

చితికిన మా బతుకుల్ని ఆదుకోవడానికి ఏ బంధువులూ ముందుకు రాలేదు.

అమ్మ అయోమయంలో పడింది. ఆపదలో ఆదుకున్నవాళ్ళే నిజమైన స్నేహితులన్నట్లుగా, అమ్మ మిత్రురాలు సుభద్రాదేవి కనిపించింది. వృత్తి రీత్యా ఆమె ఒక టీచరు. అమ్మకి ఆర్థికసాయం చేసిందేకాక, కొండంత ధైర్యాన్ని నూరిపోసింది.

''బాధ్యతలు వున్న వాళ్ళు బాధపడుతూ కూర్చుంటే, చెయ్యవలసిన పనులు చెయ్యలేరు. కొడుకు భవిష్యత్తు నీ బాధ్యత. విధి రాతకు అందరూ తలొగ్గవలసిందే!'' అమ్మ భుజాన్ని తట్టి, జీవితమ్మీద ఆశను పెంచి, బ్రతుకుమీద తీపిని గుర్తుచేశారు.

రోజులు గడుస్తున్నాయి.

క్రమేపీ అమ్మ బాధ నుండి తేరుకోసాగింది.

అమ్మలో ఆలోచనలు మొదలయ్యాయి. గుండె దిటవు చేసుకుంది. చదువు లేకపోయినా, లోకజ్ఞానం ఎక్కువ. ఇరుగు-పొరుగే తన సొంతం అనుకుంది. అందరికీ తలలో నాలుకలా మారింది.


మిత్రురాలిచ్చిన ష్యూరిటీతో బ్యాంకు లోను తీసుకొని, రెండు గేదెల్ని కొని, పాల వ్యాపారం మొదలుపెట్టింది.

ఆ డబ్బుల్తో నన్ను చదివించసాగింది. నాకు ఏ విధంగా లోటు రాకుండా, లేకుండా, తెలీకుండా పెంచసాగింది. నేను టెన్త్ అత్యధిక మార్కులతో పాసయ్యేసరికి, అమ్మ ఎంత ఆనందపడిందో చెప్పడం నా వల్లగాదు. నాకొచ్చిన పొగడ్తలలో తనుపడిన కష్టాన్నంతా మరచిపోయింది. తన కష్టసుఖాల్లో పాలుపంచుకున్న మిత్రురాలికి స్వీట్లు పంపించి, కృతజ్ఞతలు తెల్పుకుంది.

అలా రోజులు గడిచిపోతున్నాయి.

నేను పెద్దచదువులు బాగానే చదివి, పెద్ద ఉద్యోగాన్నే పొందాను.

'అమ్మకి ఏ కష్టం రాకుండా చూసుకోవాలి. మాకెంతో సాయపడిన సుభద్రాదేవిగార్కి ఏ ఆపద




వచ్చినా ఆదుకోవాలి. గతాన్ని మరచిన వ్యక్తి శవంతో సమానం' అని నా అభిప్రాయం.

ఉన్న రెండు గేదెల్ని అమ్మేయమంటే, అమ్మ నా మాట వినలేదు.

''నాకు కూడా ఊసుపోవాలిగా! నువ్వు చెప్పినట్టు ఒక గేదె అమ్మేసి బ్యాంకులోను తీర్చేస్తాను. మరోగేదె మనకుంటుంది'' అమ్మ నన్ను ఒప్పించింది.

కొద్దిరోజుల్లోనే అమ్మ ఓ సంబంధం చూసి పెళ్ళి చేసింది.

ఇదివ్వండి, అదివ్వండి అని ఆడపెళ్ళివార్ని సతాయించకుండా, కుందనపు బొమ్మలాంటి అమ్మాయిని నాకు కట్టబెట్టింది. అమ్మాయి పేరు కౌముది.

రూపంలో లావణ్యమే తప్ప, మనసులో మాలిన్యమే!

ఇంట్లో పనులు చేయకపోగా మూతివిరుపు మాటలతో అమ్మ మనసుని గాయపర్చేది. నాకు తెలిస్తే తగాదా పెద్దదవుతుందని అమ్మ సముదాయించుకునేది.

మనసులో మాలిన్యం వున్నా, మల్లెపువ్వులా నవ్వడం కొందరి తెలివితేటలని అమ్మకు తెలీదు పాపం!

ఇంట్లో పరిస్థితులు మారుతున్నాయి.

నాతో చెప్పలేక, కోడలితో గొడవ పడలేక మధ్యలో చిత్రవధ అనుభవించేది.

రోజులు గడుస్తున్నకొద్దీ, అమ్మ ఆరోగ్యం క్షీణించసాగింది.

చితి-చింత

మనిషి మరణించిన తర్వాత దహించేది చితి.

మనిషి బ్రతికుండగా దహించేది చింత.

నేనెన్ని మందులు తెచ్చినా, ఎంతమంది డాక్టర్లకి చూపించినా, నా ప్రయత్నం శూన్యమే! మనోవ్యాధికి మందులేదుగా.

చాన్నాళ్ళ తర్వాత అమ్మ మిత్రురాలు ఇంటికి వచ్చారు.

అమ్మలో అంతులేని ఆనందం చోటుచేసుకుంది. ఎక్కడలేని శక్తీ తిరిగొచ్చినట్టయ్యింది. సంతోషమే సగం బలం అన్నారుగా.

''ఇన్నాళ్ళూ ఏమయిపోయావు? ఎన్నోసార్లు మీ ఇంటికి కబురు చేశాను. ఎవరూ లేరు'' అమ్మ చెప్పుకుపోతుంది.

''ప్రమోషన్‌తో దూరంగా బదిలీ అయ్యింది. మా ఆయన అమెరికా వెళ్ళిపోదామని ఉద్యోగం వదిలేయమన్నారు. కొన్ని ఇష్టాలు మనకు కష్టం కలిగించినా మనకి సంబంధం లేకుండా జరిగిపోతుంటాయి'' ఆమె మాటల్లో ఏదో బాధ దాగుందని అమ్మ గ్రహించింది.

ఏది చెయ్యడానికైనా చేతిలో విషయం కాదు. అందుకని ''అన్నీ తెలిసినదానివి. నీకు నేను చెప్పాలా? ఎక్కడున్నా నీ క్షేమమే మా క్షేమము'' ప్రేమతో అంది అమ్మ.

''అబ్బాయెలా వున్నాడు?''

''వాడు బాగానే ఉన్నాడు. కోడలి విషయంలో బోల్తాపడ్డాము'' అమ్మ తలదించుకుని చెప్పింది.

''భారం భగవంతుడి మీద వేసి, కాలంతో పాటూ పరుగెత్తడమే!''

''నీ విచ్చిన ధైర్యమే నన్నింతదాన్ని చేసింది'' మనసు విప్పి మాట్లాడుకున్నారు.

మధ్యాహ్నం కలిసి భోజనాలు చేశారు.

''ఉన్న నువ్వు కూడా దేశాలు వెళ్ళిపోతున్నావా?'' అమ్మ కంట తడిపెట్టుకుంటూ అంది.

''ఏదెలా జరగాలో?'' వేదాంత ధోరణిలో జవా

బిచ్చి సెలవు తీసుకుంది మిత్రురాలు.

ఉద్యోగరీత్యా నాకు తీరిక లేదు. అత్తగార్ని పట్టించుకునే ధ్యాస నా భార్యకి లేదు. తెచ్చిపెట్టేవారున్నా, చేసేవారుంటేనే గదా ఆనందం.

రోజు రోజుకి అమ్మ పరిస్థితి దిగజారింది.

మరి చేసే ఓపిక లేక ఉన్న మరో గేదెని కూడా అమ్మ అమ్మేసింది.

'ఆకులో తిండి-చాపమీద నిద్ర'

'ఆకులో తింటే ఆకలి తీరదా? చాపమీద పడుకుంటే తెల్లారదా?' ఓపిక తన సొంతమన్నట్లు అమ్మ ఏమాత్రం చలించలేదు.

నాకో బిడ్డపుడితే హాయిగా ఆడుకుందామని ఆశ పడేది. ఆశ ఇంకా తీరలేదు, నా భార్య తగాదాని కొత్తగా మార్చింది.

చీటికీమాటికీ నాతో తగవు పెట్టుకోవడం మొదలుపెట్టింది. ఆఫీసులో అలసిపోయి వచ్చిన నాకు చిర్రెత్తుకొచ్చింది.

''అమ్మంటేనే నా ప్రాణం. తను పడిన కష్టం ఇంకా నా కళ్ళముందు కదలాడుతూనే వుంది. అలాంటి అమ్మను విడిచి ఉండడమా? నో..నెవ్వర్! కలలో కూడా ఇది జరగని పని. అపకారమంటే ఎరుగని ఆమెని వేలెత్తి చూపేదానివా? మమతానురాగాలు అనురాగబంధాల చిరునామా ఆమె. ఇంత జరుగుతున్నా నాకు చెప్పాలనిపించలేదామ్మా? విలువ లేని మనుషుల ముందు అరుపు లెందుకని ఊరుకున్నావా?'' నాలో ఆవేశం కట్టలు తెంచుకుంది.

అమ్మ నా భుజం నిమురుతూ ''శాంతంగా నేను చెప్పింది విను. నీ భార్య మనసులో విషబీజం పడింది. ఆమెకొచ్చిన లోటేమిటో నా కర్థం కాలేదు. నేనంటే పడతానుగానీ, నిన్నంటే వూరుకోను. నా కారణంగా మీ ఎడబాటు సహించలేను. వాళ్ళ సొంతమే కదా ఇక్కడుంటున్నది. నేనేమైనా ఒద్దన్నానా? ముసలివాళ్ళు మాకు భారమనుకుంటారుగానీ, ఇంటికి దిక్సూచిలాంటి వారని గ్రహించరు. మనసులో కల్మషాలు దాచుకుని, జీవితంలో నటించి నడవడం నా వల్ల కాదు. నేను ఊరి ప్రక్కనున్న ఆశ్రమానికి వెళ్ళిపోతాను. ఆశ్రమానికి కట్టవలసిన డబ్బులు కట్టెయ్యి. అప్పుడప్పుడూ నన్ను చూసి పోతుండు. ఈ ఇల్లు నీకు చెందినట్లు రాసిస్తాను. నాకో లక్ష రూపాయలు సర్దుబాటు చెయ్యి'' అమ్మ ఒకసారి నిర్ణయం తీసుకుంటే, మరో మార్పు ఉండదు.

నిశ్చేష్టుడినయి చూస్తున్నాను చేసేదేమి లేక.

అమ్మ ఆశ్రమంలో చేరింది.

నెల నెలా డబ్బిస్తూ, అమ్మ బాగోగులు చూస్తున్నాను. అమ్మ అడిగిన మొత్తాన్ని కొద్దిరోజుల్లోనే అందజేశాను.

అనుకోకుండా నాకు దూరంగా బదిలీ కావడం జరిగింది. అది చెబుదామని ఆశ్రమానికి వెళ్ళేసరికి ఆశ్రమంలో అమ్మ లేదు. వాళ్ళకేమీ చెప్పలేదు. వాళ్ళు కూడా ఆందోళన చెందారు. అమ్మ ఆ చూకీ కోసం ప్రయత్నించాను. ఫలితం శూన్యం.

ఈ నిరీక్షణలో చాలా ఏళ్ళు గడిచాయి.

గతం నుండి బయటపడ్డాం.

★ ★ ★

మేనేజరు కళ్ళు చెమర్చాయి.

''నేను నాది అనే స్వార్థం నాలో చోటు చేసుకుంది. తన కొడుకు వలనే గదా నేను ఈ స్థితిలో ఉన్నాననే ఇంగిత జ్ఞానం లేకపోయె! చెప్పుడు మాటలు అనే విషబీజాన్ని మనసులో నాటుకున్నందుకు, పిల్లలు మమ్మల్ని తరిమేయడం, నా అన్నదమ్ముల స్వార్థం, చివరికి మిగిలిన ఫలితం. ఎందుకో ఈ తాపత్రయం నాకర్థంగాని సమస్యగానే మిగిలింది'' కౌముది తన దోషాల్ని గొంతెత్తి చెప్పుకుంటోంది.

చెప్పుకుంటే సగం పాపం పోతుందని.

''ఆఖరి దశలో నాతో ఈ ఉత్తరం రాయించుకున్నారు. నా కొడుకు-కోడలు తారసపడితే, ఈ ఉత్తరమిమ్మని చెప్పి, ఈ ఆశ్రమం ఆశయాలు నెరవేర్చమని చెప్పారు'' ఉత్తరం నాకందిస్తూ మేనేజరు చెప్పారు.

ఉత్తరం విప్పి చదివాను.

''చివరి దశలో కలవలేనందుకు చింతిస్తున్నాను.

మీ క్షేమమే నాకానందం. నాలాంటి దుస్థితి రాకూడదు. ఒకవేళ అదే ఎదురయితే ఈ ఆదర్శ ఆశ్రమంలో ఉంటూ, దీని నిర్వహణ బాధ్యత చూసుకోండి. అందరిలో నన్ను చూసుకోండి.

ఇట్లు
మీ అన్నపూర్ణమ్మ''

అక్షరాలలో రూపాన్ని వెతుక్కుంది కౌముది. అత్తగారి మనసుని తెలుసుకొని భోరుమంది.

ఆశ్రమంలో అందర్నీ ఆదుకోవడమే గాకుండా, ఈ చరిత్ర పునరావృతం గాకుండా, కృషిచేస్తే బాగుంటుందని ఆలోచించాము.

అప్పుడే ఒక అభాగ్యురాలి ప్రవేశం.

'చివరికి అమ్మ స్థాపించిన ఆదర్శ ఆశ్రమమే మనకు ఆశ్రయమయ్యింది' మదిలో అనుకున్నాన్నేను.

☆



## పాపం వేదిక

కన్నడం నుంచి తమిళానికి అక్కడి నుంచి తెలుగుకి దిగుమతి అయిన వేదికకి నగ్మా పోలికలు వుండడం వల్ల కొంతవరకూ పాపులారిటీ లభించింది. అయితే ఆమెకి తెలుగులో ఏమంత కలిసి రావడం లేదు. అమధ్య కల్యాణ్‌రామ్‌తో నటించిన 'విజయదశమి' సినిమా ఫ్లాప్ అయ్యాక తాజాగా 'బాణం'లో చాన్స్ వచ్చింది. ఇది కూడా పరాజయాన్ని చవిచూసింది. నారా రోహిత్ హీరోగా నటించిన ఈ సినిమాకి మంచి టాక్ వచ్చినా కమర్షియల్‌గా దారుణ పరాజయాన్ని చవిచూడడంతో వేదికని పట్టించుకునే నిర్మాతలు ఇప్పుడు కరువయ్యారట. తన టైమ్ కోసం ఆశగా ఎదురుచూస్తోంది వేదిక.